సాక్షి ఒడిశా

మంగళవారం । 17 । జూన్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,70,960లు, బంగారం 4 గ్రాముల 750 మిల్లీగ్రాములు, వెండి 4 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వైద్యుల నిర్లక్ష్యానికి చిన్నారి బలి

మల్కన్‌గిరి జిల్లా ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యానికి మూడేళ్ల చిన్నారి మృత్యువాతపడింది. కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

- 8లో



పండ్లతోటల పెంపకంతో లాభాలు

పండ్లతోటల పెంపకంతో లాభాలు అధికంగా వస్తాయని జిల్లా ఉద్యాన వనాల శాఖ ఉపసంచాలకులు సుశాంత్ కుమార్ దాస్ అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

గుణుపూర్‌లో వినతుల స్వీకరణ



గ్రీవెన్స్‌లో పాల్గొన్న అధికారులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో సోమవారం కలెక్టర్ ఫరూల్ పట్వారి గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి 28 వినతులను స్వీకరించారు. ఐదుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.35 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్ సహోట, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ దుర్మరణం



ఘటనా స్థలంలో కవిత మృతదేహం

మల్కన్‌గిరి: కలిమెల సమితి ఎం.వి.79 పోలీసుస్టేషన్ పరిధిలో తమాన్‌పల్లి పంచాయతీ ఎం.వి.113 గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. అలాల్ రోజో సందర్భంగా అమూల్ మాండాల్ అనే వ్యక్తి బైక్‌పై భార్యపిల్లలతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్య కవిత అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఐఐసీ చంద్రకాంత్ తండి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి గురైన బస్సు

మల్కన్‌గిరి: కోరుకొండ సమితి సోమనాథ్‌పూర్ పంచాయతీ ఎం.వి.36 గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. బలిమెల నుంచి ఇంద్రావతి వెళ్తున్న ప్రభుత్వ బస్సు ఎదురుగా వస్తున్న ట్రక్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని బలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఐఐసీ ధీరజ్ పట్నాయిక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

క్షతగాత్రునికి సపర్యలు



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న యువకులు

కొరాపుట్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి సపర్యలు చేసి మానవీయత చాటారు యువకులు. కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి పాడువా సమీపంలో వాగ్దేవి వంతెన వద్ద ఖిల్‌గుడ గ్రామానికి చెందిన తిలక్ కుమార్ అనే ఫైనాన్స్ సంస్థ ఉద్యోగిని గుర్తు తెలియని వాహనం ఆదివారం సాయంత్రం ఢీకొట్టి వెళ్లి పోయింది. తీవ్ర రక్తస్రావంతో తిలక్ రోడ్డు పక్కన పడి ఉన్నాడు. విషయం తెలిసి పాడువకి చెందిన విశ్వనాథ్ మహంతి, షేక్ రహీం, శశిధర్ నాయర్, లాలులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితుడిని సమీప ఆస్పత్రికి ఆటోలో తరలించారు. అతని వద్ద ఉన్న రూ. ఏడు వేలు నగదు, బంగారు గొలుసు, చెవి పోగులు, ఇతర బంగారు ఆభరణాలు, మూడు సెల్ ఫోన్లను భద్రపరిచి వాటిని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధితుడు ముత్తుట్ ఫైనాన్స్‌లో పని చేస్తూ పాడువ వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. అయితే అతని పరిస్థితి విషమంగా ఉండడంతో కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించారు. క్షతగాత్రుడుని రక్షించి మానవీయత చూపించిన పాడువ యువతను పోలీసులు అభినందించారు.

జగన్నాథుడికి.. తైలమర్దన

- ఐదు రోజులుగా గోప్యంగా ఉపచారాలు
- శ్రీమందిరంలో కొనసాగుతున్న సంప్రదాయాలు



భూగర్భంలోని పులురి తైలాన్ని వడబోస్తున్న దృశ్యం

భువనేశ్వర్: పూరీలో శ్రీక్షేత్రం జగన్నాథ రథయాత్ర సన్నాహాలతో సందడిగా మారింది. తెరచాటున జగతినాథునికి గోప్య సేవలు నిరవధికంగా కొనసాగుతున్నాయి. యాత్రకు సకాలంలో సిద్ధం కావాలని స్వామి, వెను వెంటనే స్వామిని కనులారా దర్శించుకోవాలని భక్తజనం ఉవ్విళ్లూరుతున్నారు. ఐదు రోజులుగా శ్రీమందిరం రత్న వేదికపై నిత్యం దర్శనం కల్పించే చతుర్ధామూర్తులు చీకటి గదిలో గోప్య ఉపచారాలు పొందుతున్నారు. జ్యేష్ఠ పూర్ణిమ సందర్భంగా విశేష స్నానం ఆచరించిన శ్రీ జగన్నాథుడు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. ఆయనతో పాటు సోదరుడు బలభద్ర స్వామి, సోదరి సుభద్ర దేవి జ్వరం బారిన పడి తెరమరుగయ్యారు. ఈ క్రమంలో దేవదేవుళ్లకు దైతపతి సేవకులు గోప్యంగా పలు ఉపచారాలు అందజేస్తున్నారు.ఉపశమనం కోసం 5వ రోజున ఆచారం ప్రకారం పులురి మూలిక తైల మర్దన చేశారు. దీనిని శ్రీ అంగ సేవగా పేర్కొంటారు.



పులురి తైలం సిద్ధం చేస్తున్న బొడొ ఒడియా మఠం ప్రతినిధులు

భూగర్భంలో తయారీ..



స్వామి చికిత్స కోసం మట్టి పాత్రల్లో సిద్ధమైన పులురి తైలం

స్థానిక బొడొ ఒడియా మఠం పులురి మూలిక ఔషధ తైలం సిద్ధం చేస్తుంది. ఈ ప్రత్యేక తైలం పలు ఔషధీయ వన మూలికలు, సుగంధ ద్రవ్యాలతో తయారు చేస్తారు. ఏడాది పొడవునా భూగర్భంలో మట్టి పాత్రలో మూత వేసుకుని భగవంతుని ఆరోగ్యం కోసం దివ్య ఔషధంగా సిద్ధం చేస్తారు. ఏటా హేరా పంచమి నాడు పులురి తైలం పలు వన మూలికలు ఇతరేతర ఔషధీయ విలువలతో కూడిన సుగంధ ద్రవ్యాల మేళవింపుతో భూగర్భంలో చోటు చేసుకుంటుంది. స్థానిక ఒడియా మఠం ఈ సన్నాహాల్ని ఏడాది ముందుగా ప్రారంభించి స్వామి కోసం దివ్యమైన తైలం సిద్ధం చేసి ఏటా క్రమం తప్పకుండా జగతి నాథుని గోప్య సేవకులకు అందజేస్తారు. తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. పులురి వన మూలికల ఔషధీయ తైలం పూతతో మూల విరాటులు ఒళ్లునొప్పుల నుంచి ఉపశమనం పొంది మెల్లగా కోలుకుంటారు. అంచెలంచెలుగా స్వామి చికిత్సలో ప్రాచీన ఔషధీయ పదార్థాల్ని జోడించి చికిత్స చేసి మూల విరాటుల్ని యాత్రకు సిద్ధం చేస్తారు. జ్వరం అనుబంధ అస్వస్థతతో బాధపడుతున్న స్వామికి అన్న ఆహారాలు నివారించి కషాయం వంటి పత్యం నైవేద్యాలు సమర్పించి గోప్య ఉపచారాలు నిర్వహించడంలో దైతపతి సేవకులు తలమునకలయ్యారు. అతి త్వరలో స్వామి ఆరోగ్యం కోలుకుంటుందనే ఆరాటంతో శ్రమిస్తున్నారు.

ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథం వద్ద అధికారులు

కొరాపుట్: ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు జయపూర్ పట్టణంలో మెయిన్ రోడ్డులో ప్రచార రథాన్ని మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అక్కవరం శ్రస్య రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల పాటు రథం పర్యటించి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బి.సునీత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యువతరం సారథ్యంలో రాష్ట్రాభివృద్ధి



అర్హులకు నియామక పత్రాలు అందజేసిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: యువతరం సారథ్యంలో రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సమగ్ర సమాజ సంక్షేమం కోసం యువతరం ఉత్సాహం, శక్తి, సామర్థ్యాల్ని ప్రత్యక్షంగా ప్రయోగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. వివిధ విభాగాలలో ఉద్యోగాలకు అర్హత సాధించిన 964 మందికి సోమవారం ఉద్యోగ నియామక పత్రాల్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తమను తాము ప్రజల సేవకులుగా భావించి, సామాన్య ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి, సమస్యలను పరిష్కరించడానికి నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. సమాజం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ అవినీతికి అతీతంగా విధులు నిర్వర్తించాలని హితవుపలికారు.

యోగాతో మెరుగైన ఆరోగ్యం



యోగా శిక్షణలో పాల్గొన్న నిర్వాహకులు

జయపురం: యోగాతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని వక్తలు అన్నారు. ఈ నెల 21వ తేదీన అంతర్ జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జయపురం అరవిందనగర్ విద్యామందిర ప్రాంగణంలో జిల్లాస్థాయి యోగా మహోత్సవ కమిటీ, జిల్లా స్థాయి యోగా నిర్వాహకుల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. శిబిరంలో యోగా శిక్షకులు జయసేన్ మహంతి, సురేష్ నందోలు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఈ నెల 21వ తేదీన జరగనున్న యోగా డేలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యోగా మహోత్సవ కమిటీ సభ్యులు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యనిర్వాహకులు డాక్టర్ మనోరంజన్ ప్రధాన్ పాల్గొన్నారు. శిక్షణ పొందిన వారందరికీ ధ్రువ పత్రాలు అందజేశారు.

రైల్వే వంతెన కింద.. యువకుడు ఆత్మహత్య



యువకుడి మృతదేహం

కొరాపుట్/జయపురం: జయపూర్ పట్టణ సమీపంలో గొడపాదర్ గ్రామం వద్ద కొత్తవలస–కిరండోల్ రైల్వే మార్గంలో ఉన్న రైల్వే వంతెన కింద గుర్తు తెలియని యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సదరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఏఎస్‌ఐ కేసి బిసోయి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



పాదయాత్ర చేస్తున్న అధికారులు



ర్యాలీలో జిల్లా కార్మికశాఖ అధికారులు, విద్యార్థులు

పర్లాకిమిడి: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని వక్తలు అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా కార్మిక శాఖ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బాలకార్మికుల విముక్తిపై చైతన్య పాదయాత్రను జిల్లా ఆదనపు మేజిస్ట్రేట్ ఫాల్గుణీ మఝి సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. పాదయాత్రలో చైతన్య రథంతో పాటు, వివిధ పాఠశాలల విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని శోభాయాత్రలో పాల్గొన్నారు. పట్టణంలో పలు కూడళ్లలో వివిధ షాపులు, ఎస్టాబ్లిస్‌మెంట్లలో బాల కార్మికులను పనిలో పెట్టుకోరాదని అవగాహన కల్పించారు. పిల్లలను పనుల్లో పెట్టుకుంటే సంబంధిత యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కార్మిక శాఖ అధికారిణి భారతీ బెహేరా హెచ్చరించారు. బాలకార్మికుల వ్యవస్థ విముక్తి కోసం జిల్లా అంతటా చైతన్య పాదయాత్రలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్ల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న కమాండర్ ఎన్‌కేకే ప్రసాద్

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని జానకీ నగర్‌లో 12వ బెటాలియన్ ఆర్‌ఓ కార్యాలయం నుంచి సీఆర్‌పీఎఫ్ జవాన్లు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమాండర్ ఎన్‌కేకే ప్రసాద్, సెకెండ్ ఇన్ కమాండ్ కృష్ణకాంత్ సింగ్, రాజు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా రథయాత్ర

- భద్రతా ఏర్పాట్లపై డీజీపీ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా

భువనేశ్వర్:

ఈ నెల 27న జరగనున్న ప్రఖ్యాత పూరీ రథయాత్ర ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. యాత్ర సన్నాహాలు పురస్కరించుకుని సీనియర్ పోలీసు అధికారులు అనుక్షణం చురుగ్గా, అప్రమత్తంగా ఉండాలని డీజీపీ ఆదేశించారు. శ్రీ జగన్నాథుని నవ యౌవన దర్శనం, రథ యాత్ర, బహుడా (మారు) యాత్ర, స్వర్ణ అలంకరణ వంటి ప్రముఖ ఉత్సవాలు పురస్కరించుకుని దేశ విదేశాల నుంచి భారీగా భక్తులు పూరీకి రానుందని భద్రతా ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఈ క్రమంలో నేరాల నియంత్రించడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక డ్రైవ్‌లను ప్రారంభించాలని డీజీపీ ఆదేశించారు. ముఖ్యంగా హోటళ్లు, లాడ్జీలు, మఠాలు, దేవాలయాలు, బస్ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, కార్మికుల వసతి గృహాలు, ధర్మశాలల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మొదటిసారిగా, పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమన్వయ నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనితో పాటు పూరీ పట్టణంలో వివిధ ప్రాంతాలలో కృత్రిమ మేధస్సు (ఏఐ) కెమెరాలను ఏర్పాటు చేయాలని డీజీపీ ఆదేశించారు. ఉత్తర ఛక్, పూరీ, పూరీ – కోణార్క్ రోడ్ మరియు నగరంలోని వివిధ ప్రధాన కూడళ్లలో ఏఐ కెమెరాల ఏర్పాటుపై చర్చించారు. భక్తుల సౌకర్యం కోసం ట్రాఫిక్ నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

మొబైల్ యాప్..

ప్రజా రవాణా సౌలభ్యం కోసం ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేశామని, ఇది ట్రాఫిక్ సలహా, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ జామ్‌లు, ప్రత్యామ్నాయ మార్గాల గురించి తక్షణ సమాచారాన్ని అందిస్తుందని డీజీపీ వివరించారు.

ఉగ్రవాద ముప్పు..

ఉగ్రవాద దాడుల ముప్పు పొంచి ఉందనే సమాచారం అందుతున్న పరిస్థితుల్లో ఆకస్మిక విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోవడానికి యంత్రాంగం సిద్ధం చేశామని డీజీపీ తెలిపారు. సముద్రంలో భారత నావికాదళం, ఇండియన్ కోస్ట్ గార్డ్, ఒడిశా పోలీస్ మారిటైమ్ స్టేషన్ వర్గాలు ఉమ్మడి పహరా వ్యవస్థ పని చేస్తుందన్నారు.

ట్రాఫిక్ నిర్వహణకు ప్రాధాన్యత..

నగరంలో ట్రాఫిక్ నిర్వహణ కోసం రోడ్ డివైడర్, డిలినేటర్, ట్రాఫిక్ జోన్ వ్యవస్థ, నగరంలోని వివిధ ప్రదేశాలలో తగినంత పార్కింగ్ వ్యవస్థ, క్రమబద్ధమైన ట్రాఫిక్ వ్యవస్థ నిర్వహణ తదితర సమావేశంలో చర్చించారు.

ముఖ్యులపై దృష్టి

జగన్నాథుని రథ యాత్రకు గవర్నర్, ముఖ్యమంత్రి వంటి ప్రముఖులు రానున్నందున ప్రత్యేక హెలిప్యాడ్, పోలీసు బలగాల వసతి కోసం ప్రత్యేక సౌకర్యాలు, వాహనాలు, బారికేడ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ ప్రకటించారు. సమావేశంలో డైరెక్టర్ (ఇంటెలిజెన్స్) ఆర్.పి.కోచే, అదనపు పోలీస్ డైరెక్టర్ జనరల్(ఆధునికీకరణ) సౌమేంద్ర కుమార్ ప్రియదర్శి, అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ (శాంతి భద్రతలు) సంజయ్ కుమార్, రవాణా కమిషనర్ అమితాబ్ ఠాకూర్, అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ (కమ్యూనికేషన్) దయాళ్ గంగ్వార్, అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ (ఎస్‌ఏపీ) రాజేష్ కుమార్, ఇన్‌స్పెక్టర్ జనరల్ (సెంట్రల్ రీజియన్) ఎస్.ప్రవీణ్ కుమార్, ఇనస్పెక్టర్ జనరల్ (ఆపరేషన్స్) డాక్టర్ దీపక్ కుమార్, ఇనస్పెక్టర్ జనరల్ (బీపీఎస్ పీఏ) అనుప్ సాహు, డీఐజీ (ప్రొవిజనింగ్) చరణ్ సింగ్ మీనా, డీఐజీ (ఎస్‌ఐడబ్ల్యూ) డాక్టర్ కన్వర్ హబీబ్ సింగ్, డీఐజీ (ఎస్ టీఎఫ్) పినాక్ మిశ్రా, డీఐజీ (క్రైమ్ బ్రాంచ్) బి.గంగాధర్, డీఐజీ (పర్సనల్) కిషోర్ బానోత్, రైల్వే పోలీసు సూపరింటెండెంట్ వివేకానంద్ శర్మ, పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వినీత్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

మూడు వాహనాలు స్వాధీనం



చోరీ చేసిన బైకులతో పట్టుబడిన సీతల్ పైక్

మల్కన్‌గిరి: ద్విచక్ర వాహనాలను తస్కరిస్తున్న దొంగను మల్కన్‌గిరి జిల్లా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఇతని వద్ద నుంచి మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఎ ఈ నెల రెండో తేదీన స్థానిక ఐఎమ్‌ఎస్‌టీ పాఠశాల వద్ద నివసిస్తున్న ప్రకాష్ బర్మన్ అనే వ్యక్తికి చెందిన బైక్ చోరీకి గురైంది. దీనిపై మూడో తేదీన మల్కన్‌గిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీన స్థానిక ఎడ్యుకేషన్ కాలనీకి చెందిన భవానీ శంకర్ జేనా తన బైక్‌నుంచి ఇంటి ముందు పార్క్ చేయగా చోరీకి గురైంది. ఆయన కూడా పోలీసులకు సమాచారం ఇచ్చారు. అలాగే ఈ నెల రెండో తేదీ రాత్రి ఎం.వి.42 గ్రామంలో భవతోష్ విశ్వష్ అనే వ్యక్తి బైక్ ఇంటి ముందు ఉంచగా చోరీకి గురైంది. ఆయన కూడా మూడో తేదీన మల్కన్‌గిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఐఐసీ రీగాన్ కీండో పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఓ ఇంటి ముందు ఒకవ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా తానే ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్టు నేరం అంగీకరించాడు. నిందుతునిది కలిమెల సమితి జగన్నాథ్ వీధికి చెందిన సీతల్ పైక్ అలియస్ రింకు పైక్‌గా గుర్తించారు. అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసి మూడు బైకులను స్వాధీనం చేసుకున్నట్టు ఐఐసీ రీగాన్ కీండో తెలిపారు.

క్లుప్తంగా

వైద్యుల నిర్లక్ష్యానికి చిన్నారి బలి



బాలిక మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా ఆస్పత్రిలో ఆదివారం సాయంత్రం వైద్యుల నిర్లక్ష్యానికి మూడేళ్ల చిన్నారి మృత్యువాతపడింది. స్థానిక 119 కాలనీలో నివాసముంటున్న లలిత్ పాత్రో అనే వ్యక్తి కుమార్తె రోజో సందర్భంగా తోటి పిల్లలతో కలిసి ఊయల ఊగింది. ప్రమాదవశాత్తు కిందపడటంతో తలకు గాయమైంది. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు కనిపించలేదు. దీంతో బాలిక మృత్యువాతపడింది. సకాలంలో వైద్యం అందకే తమ కుమార్తె మృతిచెందిందంటూ బాలిక తండ్రి లలిత్, బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారి బ్రోజోమోహన్ దాస్ స్పందిస్తూ ఆదివారం కావడంతో ఒకపూట మాత్రమే వైద్యులు అందుబాటులో ఉన్నారని, విధులకు రావడంతో ఆలస్యమై ఉంటుందని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

లక్ష్మీపూర్ జంక్షన్‌లో హైమాస్ట్ వెలుగులు



హైమాస్ట్ లైట్లను తిలకిస్తున్న లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత

కొరాపుట్: అంతర్రాష్ట్ర ముఖ్య కూడలి లక్ష్మీపూర్‌లో హైమాస్ట్ వెలుగులు ప్రసరించాయి. సోమవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీకి చెందిన లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత పూజలు చేసి లైట్లను ప్రారంభించారు. రాయగడ–పార్వతీపురం–కొరాపుట్ పట్టణాలను కలిపే ప్రధాన జంక్షన్ కావడంతో నిత్యం ప్రయాణికులు ఇక్కడ ఉంటారు. అంధకారం వలన ప్రయాణికులు రాత్రయ్యేసరికి బితుకు బితుకుమంటున్నారు. ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను వివరించడంతో స్పందించిన లైట్లు ఏర్పాటు చేశారు.

అక్రమ మద్యంపై దాడులు



విప్పపువ్వు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం సమితిలో అక్రమ మద్యంపై ఎక్సైజ్, పోలీసు శాఖ సిబ్బంది సంయుక్తంగా దాడులు చేశారు. 60 లీటర్ల స్థానిక మద్యాన్ని సీజ్ చేశారు. అలాగే 500 లీటర్ల విప్పపువ్వు నిల్వలను ధ్వంసం చేశారు. మద్యం వ్యాపారులు కమలా బిసోయి, గరిమణి బోత్ర, కనక గౌడలను అరెస్ట్ చేశారు. దాడుల్లో స్టేషన్ అధికారి గోపాల్ క్రిష్ణ అగుపాత్ర, ఎస్సై విక్రం కిషోర్ సాహు, ఏఎస్సై చంద్ర శేఖర్ హజారీ, ఎక్సైజ్ సిబ్బంది సమీర్ కుమార్, శ్రీకాంత్ బిసోయి, గటుల్ నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా రొజో ఉత్సవాలు



రొజోరాణి పోటీల్లో పాల్గొన్న యువతులు

రాయగడ: జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అశోక్ కళ్యాణ మండపంలో సోమవారం రొజో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో యువతులకు పిండివంటలు ప్రదర్శన, ముగ్గుల పోటీలు, కబడ్డీ, స్లో సైకిల్ రేస్ వంటి పోటీలు నిర్వహించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి మీనతి దే, సీడీపీఓ మీనతీ దాస్ పర్యవేక్షించారు.

పిడుగు పాటుకు ఇద్దరు మృతి



చికిత్స పొందుతున్న కాజల్





మృతి చెందిన సునాలి (ఫైల్), రూపాలి (ఫైల్)

రాయగడ : గుడారి పరిధిలోని భటియాబి గ్రామంలో రొజో సంక్రాంతి సందర్భంగా వనభోజనాలు ముగించుకుని అంతా ఇంటికి సంతోషంగా వస్తున్న సమయంలో పిడుగు పడటంతో ఇద్దరు యువతులు మృతి చెందారు. మరో యువతి తీవ్ర గాయాలపాలైంది. సోమవారం జిల్లాలోని గుడారిలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుల్లో సునాలి గౌడొ(24), రూపాలి గౌడొ (21)లుగా గుర్తించారు. తీవ్రగాయాలకు గురైన వ్యక్తి కాజల్ గౌడొగా గుర్తించారు. బాధితురాలిని గుణుపూర్ ఆస్పత్రికి తరలించారు.

పండ్లతోటల పెంపకంతో లాభాలు

- ఉద్యానవనశాఖ డీడీ సుశాంత్ కుమార్ దాస్

పర్లాకిమిడి: పండ్లతోటల పెంపకంతో లాభాలు అధికంగా వస్తాయని జిల్లా ఉద్యాన వనాల శాఖ ఉపసంచాలకులు సుశాంత్ కుమార్ దాస్ అన్నారు. జిల్లాలోని రాగగిరి, గుమ్మా, కాశీనగర్, ఆర్.ఉదయగిరి, నువాగడలో పండ్ల తోటల సాగువల్ల రైతులు, మహిళా గ్రూపులకు అత్యంత లాభదాయకం ఉంటుందని చెప్పారు. స్థానిక గజపతి స్టేడియంలో జరుగుతున్న వికాస్ మేళాకు మూడో రోజైన సోమవారం జరిగిన సభకు గౌరవ అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జిల్లా పరిషత్ సీడీఎం శంకర కెరకెటా, జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధి శాఖ పీవో అంశుమాన్ మహాపాత్రో, జిల్లా ముఖ్యవిద్యాధికారి డాక్టర్ మాయాధర్ సాహు, జిల్లా ఉద్యానవనాల శాఖ ఉపసంచాలకులు సుశాంత్ కుమార్ దాస్, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారిని అర్చనామంగరాజ్ తదితరులు హాజరయ్యారు. స్థానిక పదామృత నృత్య అకాడమి కళాకారులు ఒడిస్సీ నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. వారికి జ్ఞాపికలతో అధికారులు అభినందించారు. కాగా వికాస్ మేళాకు మూడో రోజు ప్రేక్షకులు హాజరుకాకపోవడంతో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.



నృత్య కళాకారులకు జ్ఞాపికలు బహూకరిస్తున్న జిల్లా ఎస్పీ జ్యోతింద్రనాథ్ పండా



గజపతి వికాస్ మేళాలో ఒడిస్సీ నృత్య ప్రదర్శన



వికాస్ మేళాలో పదామృత నృత్య అకాడమి కళాకారుల ప్రదర్శన



ప్రసిద్ధి గాంచిన కొమ్ము వస్తువులు, బెత్తంతో చేసిన ఫర్నిచర్ స్టాల్



గుమ్మకు చెందిన మహిళా గ్రూప్ కొండచీపుళ్ల స్టాల్

వయోవృద్ధులను బాగా చూసుకోవాలి



వేదికపై అతిథులు



పాల్గొన్న వృద్ధులు

జయపురం: వయో వృద్ధులను అందరూ బాగా చూసుకోవాలని వక్తలు అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినాన్ని ఆదివారం జయపురం సబ్‌డివిజన్ బోయిపరిగుడ సమితి ముండగుడ గ్రామంలోని వృద్ధాశ్రమంలో నిర్వహించారు. కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం వారు నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా న్యాయ సేవా సహాయకులు, న్యాయవాది కె.దివాకరరావు పాల్గొని మాట్లాడారు. వృద్ధులు మనకు మార్గదర్శకులన్నారు. వారినుంచి అనేక విషయాలు నేర్చుకోవచ్చునని చెప్పారు. వృద్ధులను అందరూ గౌరవించాలని, వారిపై నిర్లక్ష్యం తగదని హితవు పలికారు. పలువురు వృద్ధులను వేధించడం, హీనంగా చూడటం జరుగుతోందన్నారు. అటువంటివారిలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో ఏటా జూన్ 15వ తేదీన వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహణ దినాన్ని జరుపుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో న్యాయ సేవా సహాయకులు, న్యాయవాది హరిశ్చంద్ర ముదులి, న్యాయవాది కె.దివాకర గౌథ, పేనల్ న్యాయవాది శురేష్ హుడ్డప్, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ ప్రధాన క్లర్క్ శ్రీకాంత దండసేన, జూనియర్ క్లర్క్ దేవేంద్ర కంహార్ పాల్గొన్నారు.

సహకార శాఖ ఉద్యోగులపై తేనెటీగల దాడి

- ఏడుగురి పరిస్థితి విషమం



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

కొరాపుట్: ప్రభుత్వ సహకార శాఖ ఉద్యోగులపై తేనే టీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. నబరంగ్‌పూర్ జిల్లా చందాహాండి–జోరిగాం సమితుల మధ్య ఘాట్ రోడ్డులో చందాహాండి సమితి ల్యాంప్స్ ఉద్యోగులు సుమారు 20 మంది పిక్నిక్ కోసం సోమవారం వెళ్లారు. అటవీ ప్రాంతంలో పర్యటిస్తుండగా తేనే టీగలు దాడి చేయడంతో ప్రాణ భయంతో పరుగులు తీశారు. అదే ప్రాంతంలో వెళ్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బసంతా బిసోయి వారిని రక్షించారు. అంబులెన్స్‌ని రప్పించి చందాహాండి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఏడుగురు పరిస్థితి విషమించడంతో నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వారి శరీరంపై సుమారు 200 పైగా తెనే టీగల గాట్లు ఉన్నాయని వైద్యులు ప్రకటించారు. బాధితులలో ల్యాంప్స్ ఎండీ బబులా స్వయ్ తదితర ఉద్యోగులు ఉన్నారు.

వికాస రథం ప్రారంభం



జెండాఊపి రథాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహంతి

జయపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా జయపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వికాస వాహన రథాన్ని ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ నరేంద్రమహంతి జెండా ఊపి రథాన్ని ప్రారంభించారు. వైస్ చైర్మన్ బి.సునీత, జయపురం సబ్‌కలెక్టర్, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారిణి అక్కవరం శౌర్య రెడ్డి పాల్గొన్నారు. ఈ రథం పట్టణంలో 28 వార్డులలో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తుందని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వినతుల వెల్లువ



కొరాపుట్: జోరిగాంలో ఫిర్యాదుల స్వీకరిస్తున్న నబరంగ్‌పూర్ కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో, ఎస్పీ సందీప్ సంపత్



పర్లాకిమిడి: గ్రీవెన్సులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జిల్లా పరిషత్ అధికారి



కొరాపుట్: నారాయణ పట్నలో ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ ప్రేమలాల్ హియాల్

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ దండిమా పంచాయతీలో సోమవారం గ్రామముఖి పరిపాలన, గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, ఎస్పీ జ్యోతింద్ర కుమార్ పండా, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శంకర కెరకెటా తదితరులు హాజరయ్యారు. మోహనా బ్లాక్‌లో దండిమా, చంద్రగిరి, భగ్గమర్రి, మాణిక్‌పూర్ పంచాయతీల నుంచి 43 వినతులు అందాయి. వీటిలో వ్యక్తిగతం 13, గ్రామ సమస్యలకు సంబంధించినవి 30 ఉన్నాయి. ప్రధానమంత్రి ఆవాస్ యోజనా, సామాజిక పింఛన్లు, భూ పట్టాలు, రేషన్ కార్డులు వంటి సమస్యలపై వినతులు అందాయి. వీటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మోహనా బ్లాక్ చైర్మన్ రాజీవ్ శోబోరో, బీడీఓ రాజీవ్ దాస్, సీడీఎంఓ మహమ్మద్ ముబార్ ఆలీ, జిల్లా సామాజిక భద్రత అధికారి సంతోష్ కుమార్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో..

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో అధికారులు సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. నబరంగ్‌పూర్ జిల్లా జోరిగాం సమితి కేంద్రంలో గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. 30 ఫిర్యాదులు అందాయి. ఇందులో 21 ఫిర్యాదులు వ్యక్తిగతం, మరో 9 సామాజిక ఫిర్యాదులున్నాయి. వీటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ మడ్కర్ సందీప్ సంపత్ పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా నారాయణ పటన్‌లో సబ్ కలెక్టర్ ప్రేమ లాల్ హియాల్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. నలుగురు దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ చేశారు.

కలుషిత పదార్థాలు, పానీయాలపై.. ప్రత్యేక చర్యలు



పరీక్ష కోసం ప్యాకెట్ నీటి నమూనాను సేకరిస్తున్న సిబ్బంది



ప్యాకెట్ తాగునీరు ఉత్పాదన సంస్థల్లో బీఎంసీ, ఆహార భద్రత బృందం తనిఖీ



ప్యాకెట్ తాగునీరు వ్యవస్థ సీజ్ చేసిన బీఎంసీ



తినుబండారాల దుకాణంలో తనిఖీలు చేస్తున్న సిబ్బంది

భువనేశ్వర్:

జాజ్‌పూర్ జిల్లాలో తలెత్తిన అతిసార అతివేగంగా కటక్ ప్రాంతానికి విస్తరించింది. నగరంలో పరిస్థితి చేయి దాటకుండా స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ ముందస్తు చర్యల కోసం ప్రత్యక్షంగా రంగంలోకి దిగింది. నగరంలో కలుషిత ఆహార పదార్థాలు, పానీయాల ఉత్పాదన, అమ్మకం, వినియోగంపై దృష్టి సారించింది. ఆహార భద్రత బృందం సమన్వయంతో నగరంలో పలాసుణి, పాండ్రా, గొడాకొణ, పటియా, కిట్ ప్రాంతం, గజపతి నగర్, పాత్రొపొడా తదితర ప్రాంతాల్లో వివిధ ప్యాకెట్ల తాగునీరు తయారీ యూనిట్లు, కొన్ని హోటళ్లను తనిఖీ చేసింది. ప్యాకెట్లలో తాగు నీరు, గొట్టపు బావినీరు నమూనాల్ని సేకరించి పరీక్ష కోసం సిఫారసు చేసింది. కలుషిత తాగునీరు ప్యాకెట్లు ఉత్పత్తి సంస్థలపై దాడి చేసి తక్షణ చర్యలు చేపట్టింది. ఈ దాడులు నిరవధికంగా కొనసాగుతాయని బీఎంసీ హెచ్చరించింది.

ఉత్సాహంగా రోజ్జో వేడుకలు



ఊయలు ఊగుతున్న మాజీ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి



ఊయల ఊగుతున్న డాబుగాం జెడ్పీ సభ్యురాలు డాక్టర్ లిఫికా మజ్జి

ఉత్కళ మహిళలు ఆనందంగా జరుపుకుంటున్న రోజ్జో వేడుకలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. మరికొన్ని రోజుల్లో ఉత్సహం ముగియనుంది. దీంతో సోమవారం తోటలు, చెట్ల వద్ద ఊయలు ఊగుతూ మహిళలు ఆనందంగా గడిపారు. చందాహాండి సమితిలో నబరంగ్‌పూర్ మాజీ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి రోజ్జో వేడుకలు ప్రారంభించారు. కొరాపుట్ జిల్లా పరిషత్ ప్రెసిడెంట్ సస్మితా మెలక రోజ్జో సందర్భంగా చేతికి గోరింటాకు పెట్టుకొని అధికార కార్యక్రమాలకు హాజరయ్యారు. డాబుగాం జిల్లా పరిషత్ సభ్యురాలు డాక్టర్ లిఫికా మజ్జి స్థానికులతో కలిసి ఊయలు ఊగుతూ సందడి చేశారు.

–కొరాపుట్



చేతికి గోరింటాకుతో కొరాపుట్ జెడ్పీ చైర్‌పర్సన్ సస్మితా మెలక



నందపూర్‌లో ఊయలు ఊగుతున్న గిరిజన మహిళలు

అతిసార కట్టడికి చర్యలు తీసుకున్నాం



మాట్లాడుతున్న మంత్రి ముఖేష్ మహాలింగ్

- ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్

భువనేశ్వర్: అతిసార వ్యాప్తి కట్టడి పట్ల ప్రభుత్వం కట్టుదిట్టంగా వ్యవహరిస్తోంది. ప్రభావిత ప్రాంతాల్లో తాజా పరిస్థితిని అనుక్షణం సమీక్షిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి తనిఖీలు ముమ్మరం చేసింది. జాజ్‌పూర్, కెంజొహర్ జిల్లాల్లో అతిసార విస్తరణ, తీవ్రత, తాజా పరిస్థితిని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టరు ముఖేష్ మహాలింగ్ సోమవారం ప్రత్యక్షంగా సమీక్షించారు. మంత్రి అధ్యక్షతన జరిగిన సమీక్షలో రాష్ట్ర ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ మిశ్రా, ఆరోగ్య సేవల డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర నాథ్ మహంతి, ఆహార భద్రతా డైరెక్టర్ డాక్టర్ శక్తి ప్రసాద్ మిశ్రా, జాజ్‌పూర్ జిల్లా కలెక్టర్ పి.అన్వేష రెడ్డి, మూడు కేంద్ర ఆరోగ్య బృందాలు, జిల్లా ప్రధాన వైద్య అధికారులు (సీడీఎంవో), వైద్య కళాశాల అధ్యాపకులు, ఇతర క్షేత్రస్థాయి అధికారులు హాజరయ్యారు. సమీక్ష సందర్భంగా, పాఠశాల పునఃప్రారంభానికి ముందు పాఠశాల ఆవరణలో ఉన్న గొట్టపు బావులు, నీటి ట్యాంకులు సహా అన్ని తాగునీటి వనరులను క్రమం తప్పకుండా శుద్ధి చేయాలని నీటి సరఫరా శాఖ ఇంజినీర్లకు మంత్రి ఆదేశించారు. అతిసార రోగులను ప్రారంభ దశలోనే గుర్తించి ఓఆర్ఎస్, తదితర మందులను సకాలంలో పంపిణీ చేయాలన్నారు. బాధితులు సకాలంలో ఆస్పత్రిలో చేరేలా చైతన్యపరిచేందుకు బాధితుల పట్ల నిఘా పెట్టాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ క్షేత్ర సిబ్బందిని ఆదేశించారు. అట్టడుగు, మారుమూల ప్రాంతాల్లో ఉంటున్న వారికి అతిసార నివారణ పట్ల అవగాహన కల్పించేందుకు డిజిటల్ ప్లాట్ ఫామ్‌ల ద్వారా ప్రచారాలను ప్రారంభించే బాధ్యత జిల్లా యంత్రాంగానికి అప్పగించారు.

అతిసార వ్యాప్తి ఆపుదాం

- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ పిలుపు
- చైతన్య రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ముఖేష్ మహాలింగ్



అతిసార నివారణ సమాచార పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి, ప్రజాప్రతినిధులు

భువనేశ్వర్: రాష్ట్రంలో అతిసార వ్యాప్తి బెంబేలెత్తిస్తోంది. ప్రజా చైతన్యంతో ఈ సంక్రమణకు కళ్లెం వేయాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో అతిసార ఆపుదాం (స్టాప్ డయేరియా) నినాదంతో చైతన్య ప్రచార రథాన్ని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ సోమవారం ప్రారంభించారు. ఢెంకనాల్ జిల్లా భువన్ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణ నుంచి కాషాయ పతాకం ఊపి ఈ రథాన్ని ప్రారంభిచారు. ఈ ప్రచారం జూలై నెల 31 వరకు నిరవధికంగా కొనసాగుతుందని మంత్రి ప్రకటించారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రత్యక్షంగా ఈ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అతిసార నివారణ, నియంత్రణ కోసం సాధ్యమైన అన్ని చర్యలూ సకాలంలో చేపడుతున్నారు. మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవలు, సంబంధిత పరికరాలు, మందులు, మౌలిక సదుపాయాలతోపాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, కమ్యూనిటీ కేంద్రాలు, ఆరోగ్య దేవాలయాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు, మందులు అందుబాటులో ఉంచారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పని చేసే అన్ని క్షేత్ర స్థాయి ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, బహుళార్థ సాధక ఆరోగ్య కార్యకర్తలకు ప్రాథమిక దశ నుంచి అతిసార వ్యాధి గుర్తింపు శిక్షణ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. అవగాహన సందేశాలు, ఓఆర్ఎస్, జింక్ మాత్రలు, ఇతర మందులకు సంబంధించిన సమాచార కరపత్రాలతో ఇంటింటికీ వెళ్లాలని మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ అన్ని వర్గాల ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. అతిసార లక్షణాలు కనిపించిన వెంటనే ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య చికిత్స పొందాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా అతిసార నివారణ కోసం హాజరైన తల్లులకు మంత్రి ఓఆర్ఎస్, జింక్ మాత్రల ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఢెంకనాల్ ఎంపీ రుద్ర నారాయణ్ పాణి, పారొజంగ్ ఎమ్మెల్యే బిభూతి ప్రధాన్, హిందోళ్ ఎమ్మెల్యే సీమారాణి నాయక్, కామాఖ్యనగర్ ఎమ్మెల్యే శత్రుఘ్న జెనా పాల్గొన్నారు. అతిసార కట్టడి సంబంధిత సమాచార సంచికను మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు ఆవిష్కరించారు.

క్లుప్తంగా

పాఠశాలలో ప్రొజెక్టర్ చోరీ

రామభద్రపురం: మండలకేంద్రంలోని అగురు వీధి ప్రాథమిక పాఠశాలలో కయాన్ ప్రొజెక్టర్ చోరీకి గురైంది. ఈ చోరీపై పాఠశాలకు చెందిన ఇద్దరు టీచర్లతో కలిసి హెచ్ఎం బి.తిరుపతిరావు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. హెచ్ఎం తెలిపిన వివరాల ప్రకారం డిజిటల్ తరగతుల నిర్వహణలో భాగంగా 2022లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1.30 లక్షలు విలువ చేసే కయాన్(ఇంటరాక్టివ్ ప్రొజెక్టర్)అందజేసింది. అయితే పాఠశాలల పునఃప్రారంభం తర్వాత శని,ఆదివారాలు సెలవుల్లో గుర్తు తెలియని దుండగులు తరగతి గది తాళం విరగ్గొట్టి కయాన్ ప్రొజెక్టర్ దొంగతనానికి పాల్పడ్డారు. పాఠశాలకు చెందిన స్కావెంజర్ ఆదివారం ఉదయం తరగతి గదులు పరిశుభ్రం చేయడానికి వెళ్లి తలుపుల తాళం విరగ్గొట్టి ఉండడం ప్రొజెక్టర్ చోరీ జరిగినట్లు గుర్తించి తనకు సమాచారం ఇవ్వగా వెంటనే పాఠశాలకు చేరుకుని పరిశీలించి తోటి టీచర్లతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఫిర్యాదు మేరకు ఎస్సై వి.ప్రసాదరావు పాఠశాలకు చేరుకుని చోరీ జరిగిన తరగతి గదితో పాటు పాఠశాల ఆవరణంతా పరిశీలించారు. ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్సై తెలిపారు.

10 మంది జూదరుల అరెస్ట్

పూసపాటిరేగ: మండలంలోని కొల్లాయివలస సమీపంలో మామిడి తోటలో పేకాట ఆడుతున్న పదిమందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ తెలియజేశారు. వారి నుంచి రూ.14,210 నగదు, 4 మోటార్ సైకిల్స్, 9 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను కోర్టుకు తరలిస్తామ న్నారు.

గంజాయి మత్తులో విద్యార్థిపై దాడి

విజయనగరం క్రైమ్: నగరంలోని కేఎల్ పురానికి చెందిన సాగర్ మరోసారి గంజాయి మత్తులో ఆర్‌కే కళాశాలకు చెందిన విద్యార్థి మహేంద్ర లక్ష్మణ్ కుమార్‌పై దాడికి పాల్పడ్డాడు. గతంలో కూడా సాగర్ గంజాయి మత్తులో ఇద్దరు విద్యార్థులపై దాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో బాధిత విద్యార్థి, తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, క్రైమ్ ఎస్సై సురేంద్రనాయుడు వివరాలను క్షుణ్ణంగా తెలుసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

నేలబావిలో పడి మతిస్థిమితం లేని వృద్ధుడి మృతి



బావి ఒడ్డున వృద్ధుడి మృతదేహం

రాజాంసిటీ: నేలబావిలో పడి పట్టణ పరిధిలోని గొల్లవీధికి చెందిన బొబ్బిలి లక్ష్మణ (69) అనే మతిస్థిమితంలేని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తెలగవీధి శ్మశానం సమీపంలో జరిగింది. దీనికి సంబంధించి ఎస్సై వై.రవికిరణ్ సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మణ కొద్ది సంవత్సరాలుగా మతిస్థిమితం కోల్పోయి అప్పుడప్పుడు ఇంటి నుంచి ఒకటి రెండు రోజులు ఎటో వెళ్లిపోయి మళ్లీ వస్తుంటాడు. ఈ క్రమంలోనే ఈ నెల 15న మధ్యాహ్నం భోజనం అనంతరం ఎటో వెళ్లిపోయాడు. రాత్రి సమయం అయినా రాకపోవడంతో కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. తన భర్త తెలగవీధిలోని శ్మశాన వాటిక వద్ద బావికి స్నానానికి వెళ్తుండేవాడని ఇప్పుడు కూడా అటే వెళ్లి ఉంటాడని వృద్ధుడి భార్య నారాయణమ్మ భావించి సోమవారం తెల్లవారుజామున కుటుంబసభ్యులతో వెళ్లి చూడగా బావి ఒడ్డున లక్ష్మణ చేతికర్ర ఉండడంతో బావిలోకి చూశారు. బావిలో మృతదేహం తేలియాడడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆటోను బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు



ఆటోను ఢీకొనడంతో గాయపడిన పాపినాయుడు

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామ జాతీయ రహదారిపై విజయనగరం నుంచి వస్తున్న ఆటోను గజపతినగరం నుంచి వెళ్తున్న ద్విచక్రవాహన చోదకుడు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ మేరకు బొండపల్లి ఎస్సై మహేష్ విలేకరులకు తెలిపారు. గాయపడిన వ్యక్తిని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని చెప్పారు. గాయాల పాలైన వ్యక్తిని నెల్లిమర్ల మండలం తాళ్లపూడి పేటకు చెందిన ధవళ పాపినాయుడుగా గుర్తించామన్నారు.

నేడు వీఆర్ సాగర్ వద్ద యోగాంధ్ర

మక్కువ: పర్యాటక ప్రదేశాల్లో యోగాంధ్రలో భాగంగా మక్కువ మండలం శంబర గ్రామ సమీపంలోని వెంగళరాయసాగర్ ప్రాజెక్టు ఏనుగుకొండ వద్ద యోగాంధ్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఏనుగు కొండ పరిసరాలను కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయన వెంట జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు కె.రామచంద్రరావు, అధికారులు ఉన్నారు.



వేలిముద్ర వేస్తేనే.. సాగు సాయం!

- అన్నదాత సుఖీభవ కావాలంటే ఈకేవైసీ చేసుకోవాల్సిందే..
- కొత్త నిబంధన పెట్టిన కూటమి సర్కారు
- ఈ నెల 20వ తేదీ వరకే గడువు..
- లబ్ధిదారుల సంఖ్య తగ్గించడానికేనంటూ రైతన్నలు మండిపాటు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2.58 లక్షల మందికి సాగుసాయం
- ఈకేవైసీ కోసం ప్రస్తుతం జిల్లాకు వచ్చిన జాబితా 2.26 లక్షలు
- ప్రభుత్వ నిబంధనలతో ఈ సంఖ్య తగ్గే అవకాశం



తప్పని నిరీక్షణ

చిత్రంలో ఈకేవైసీ కోసం నిరీక్షిస్తున్నది బాడంగి మండలం భీమవరం రైతులు. వేలిముద్ర వేస్తేనే అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి అందుతుందని, లేదంటే అందదని చెప్పడంతో భీమవరం ఆర్ఎస్‌కే (రైతు సేవా కేంద్రం) వద్ద ఇదిగో ఇలా సోమవారం గంటల తరబడి నిరీక్షించి ఈకేవైసీ పూర్తిచేసుకున్నారు. వర్షాలు కురుస్తున్నాయి.. ఖరీఫ్ పనులు ఆరంభమయ్యాయి.. ఈ దశలో పొలంబాట పట్టాల్సిన రైతులు.. కూటమి ప్రభుత్వ విధానాలతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతంలో ఇలాంటి నిబంధనలు ఉండేవి కాదని, పాతవారికి యథావిధిగా పథకం వర్తించేదని, కొత్తవారి పేర్లు నమోదు చేసేవారని గుర్తుచేస్తున్నారు. ఇచ్చేదే అరకొర.. అందులో కొర్రీలు అంటూ వాపోతున్నారు. – బాడంగి

'కొల్లు భవానీ అనే మహిళకు గంట్యాడ మండలం నందాం గ్రామంలో 10 సెంట్లు భూమి ఉంది. ఆమెకు గతంలో రైతు భరోసా పథకం కింద ఆర్థిక సాయం అందింది. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పింది. ఈకేవైసీ చేయించుకోవడానికి నరవ రైతుసేవా కేంద్రానికి వెళ్తే ఇన్‌ఎలిజిబుల్ అని వచ్చింది. దీంతో ఆమె నిరాశతో వెనుదిరిగింది.'

ఇదే గ్రామానికి చెందిన సంక్రాన రామకృష్ణకు 0.09 సెంట్లు ఉంది. ఇతనికి గతంలో వైఎస్సార్ రైతు భరోసా సాయం అందింది. కాని ప్రస్తుతం ఈకేవైసీ చేయించుకోవడానికి నరవ రైతు భరోసా కేంద్రానికి వెళ్తే ఇన్ఎలిజిబుల్ అని వచ్చింది. దీంతో నిరాశతో వెనుదిరిగారు.

విజయనగరం ఫోర్ట్:

సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం కొర్రీలకు లబ్ధిదారులు వర్రీ అవుతున్నారు. రైతు సేవా కేంద్రాలకు (ఆర్ఎస్‌కే) పరుగులు తీస్తున్నారు. ఈకేవైసీ అయితేనే అన్నదాత సుఖీభవ పథకం అందుతుందని స్పష్టం చేయడంతో పనులు మానుకుని రైతులు ఆర్ఎస్‌కేల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. పొట్టకూటికోసం వలసబాట పట్టిన సన్న, చిన్నకారు రైతులు మొర్రోమంటూ గ్రామాలకు వస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రైతులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏడాదికి రూ.13,500 చొప్పున ఐదేళ్లపాటు ఠంచన్‌గా ఆర్థిక సాయాన్ని అందించింది. రైతులకు ఎటువంటి నిబంధన పెట్టకుండా సాగుసాయం చేసింది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూపాయి సాయం కూడా అందజేయలేదు. రెండో ఏడాది అమలుచేస్తామన్న పథకానికి నిబంధనలు విధించింది. ఆర్ఎస్‌కేలో వేలిముద్ర (ఈకేవైసీ)ను తప్పనిసరి చేసింది. 10 సెంట్లు లోపు భూమి ఉన్న వారు అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులని ప్రకటించింది. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించడానికే కూటమి ప్రభుత్వం కొత్త నిబంధనలు పెడుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



భోగాపురం మండలంలో రైతులకు ఈకేవైసీ చేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్



అప్పుడు అలా.. ఇప్పుడిలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కింద 2.58 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు. కూటమి సర్కారు అన్నదాత సుఖీభవ పథకం కోసం 2.26 లక్షల మంది రైతులకు ఈకేవైసీ చేయాలని వ్యవసాయశాఖకు జాబితా పంపింది. జిల్లాలో ఉన్న 505 రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయ సంచాలకులు రైతులకు ఈకేవైసీ చేయిస్తున్నారు. ఈకేవైసీ గడువు ఈనెల 20వ తేదీ వరకు ఇవ్వడంతో లక్షలాది మంది రైతులకు ఈకేవైసీ సాధ్యమేనా అన్న సందేహం వ్యక్తమవుతోంది.

ఈకేవైసీ తప్పనిసరి

అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతులకు ఈకేవైసీ చేయించాలని ఉన్నతాధికారుల నుంచి జాబితా వచ్చింది. ఆ జాబితా ప్రకారం ఈకేవైసీ చేయిస్తున్నాం.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

సాగు సాయం ఇంకా అందని వైనం...

అధికారంలోకి వస్తే రైతులకు ఏటా సాగుపెట్టుబడి అందిస్తామని కూటమి సర్కారు గొప్పలు చెప్పింది. గద్దెనెక్కిన మొదటి ఏడాదే రైతులకు ఇచ్చిన హామీని విస్మరించింది. రెండో ఏడాది ఖరీఫ్ ఆసన్నమైనా ఇప్పటివరకు రూపాయం సాగు సాయం అందించలేదు. ఇప్పుడు కొత్తగా నిబంధనలు పెట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఏనుగుల సంచారంతో అప్రమత్తంగా ఉండాలి

బొబ్బిలి రూరల్: మండలంలోని ముత్తాయివలస గ్రామ శివారు ప్రాంతంలో తిష్టవేసిన అడవి ఏనుగులతో అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ పిల్లా వసుంధర, అటవీశాఖ అధికారులు గ్రామస్తులను హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఏనుగుల సంచార ప్రాంతానికి చేరుకుని ఏనుగుల దాడినుంచి తప్పించుకునే అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పశువులను, మేకలను ఏనుగులున్న ప్రాంతాలవైపు తరలిపోకుండా చూసుకోవాలని,నిత్యం అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు వివరించారు.అటవీశాఖ అధికార సిబ్బంది ఎప్పకప్పుడు సమాచారం అందిస్తారని అందుకు అనుగుణంగా మెలగాలని సూచించారు. వాటికి హానికలిగించే చర్యలు చేపట్టవద్దని, ఆందోళన చెందవద్దని సూచించారు.

గిరిపుత్రుల నుంచి రూ.23 లక్షలు స్వాహా!



కలెక్టరేట్‌కు వచ్చిన బాధిత గిరిజనులు

- రుణాల పేరిట టోకరా
- వెలుగు సీసీ నిర్వాకమేనా?

సాక్షి, పార్వతీపురం మన్యం:

వారంతా గిరిపుత్రులు. అక్షరం రాని అమాయకులు. ఎవరేం చెప్పినా గుడ్డిగా నమ్మేయడమే తెలుసు. అటువంటి వారికీ టోకరా పెట్టారు మన 'వెలుగు' సిబ్బంది. గిరిజనులకు రుణాల పేరిట ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రూ.23 లక్షలు వాడేశారు. ఆ సొమ్ముల్లో ఒక్క రూపాయి కూడా ఆ అమాయకులకు వెళ్లలేదు. తీరా, ఇప్పుడు వారి పేరిట రుణాలు కనిపిస్తే లబోదిబోమంటున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు, రాయగడ జమ్ము, చాపరాయిబిన్నిడి పంచాయతీలకు చెందిన సుమారు 14 మహిళా సంఘాల్లో స్త్రీ నిధి(టీఎస్‌పీ) రుణాల్లో గోల్‌మాల్ చోటు చేసుకుంది. ఇక్కడ రుణాలు పొందకుండానే, దాదాపు 50 మంది గిరిజనులు రుణాలు పొందినట్లు చూపుతున్నారు. ప్రధానంగా అప్పట్లో సీసీగా పని చేసిన ఓ వ్యక్తిపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2014 నుంచి 2020 వరకు అతని పని చేసినట్లు గిరిజనులు చెబుతున్నారు. 2016, 2017, 2018 సంవత్సరాల్లో సంఘాల పేరిట స్త్రీనిధి రుణాలు మంజూరయ్యాయి. రాయగడ జమ్ము ఎస్‌హెచ్‌జీలో 27 మంది, చాపరాయి బిన్నిడి ఎస్‌హెచ్‌జీలో 12 మంది, బాలేసులో 11 మంది నుంచి రూ.23 లక్షలు దుర్వినియోగమైనట్లు తెలుస్తోంది. ఆ నిధులు గిరిజనులకు ఇవ్వకుండానే.. అసలు రుణాలొకటి ఇస్తున్నట్లు వారికి తెలియకుండానే.. వారి పేరుతోనే ఈ మొత్తం స్వాహా చేశారు. ఒక్కొక్కరి పేరిట రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు రుణాలు పొందినట్లు చూపుతున్నారు.

అధికారులకు మొర..

తమకు తెలియకుండానే రుణాలు పొంది, దుర్వినియోగం చేసినట్లు తెలియడంతో వల్లాడ, చాపరాయిబిన్నిడి, రేగిడి, కర్లగూడ, చినరావికోన గిరిజన గ్రామాలకు చెందిన గిరిజనులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి తరలివచ్చారు. జిల్లా రెవెన్యూ అధికారి హేమలతను కలసి వినతిపత్రం అందజేశారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీసీ నిర్వాకమే..



2014 నుంచి 2020 వరకు రాయగడ జమ్ము సీసీగా పనిచేసిన వ్యక్తిపైనే మాకు అనుమానాలున్నాయి. ఆయనే నిధులు దుర్వినియోగం చేశారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. గతంలో సదరు సీసీ బదిలీపై వెళ్లారు. మరలా ప్రస్తుతం ఇక్కడే నియమించారు. గిరిజనులను మోసం చేయడం దారుణం. సదరు సీసీపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలి.

– మండంగి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

సారా తరలిస్తున్న ముగ్గురు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి

పాలకొండ: సారా నిర్మూలనలో భాగంగా సోమవారం చేపట్టిన దాడుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. సీతంపేట మండలం దిగువ బుడగరాయి వద్ద దారి కాపలా కాయగా పాలకొండ మండలం ఓని గ్రామానికి చెందిన కనపాక నవీన్ 20 లీటర్ల సారా, బుడగరాయి గ్రామానికి చెందిన సవర మంగయ్య 10 లీటర్ల సారా తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. వారితో పాటు దిగువ బుడగరాయికి చెందిన పాత నేరస్తుడు సవర వెంకయ్యను అరెస్టు చేసి ముగ్గురిని కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. సారా తయారీకి ఉపయోగించే బెల్లం విక్రయాలు చేపడుతున్న వీరఘట్టం మండలానికి చెందిన ఆరుగురు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. నవోదయం 2 కార్యక్రమంలో భాగంగా సారా అమ్మకాలు చేస్తున్న గ్రామాలపై నిఘా ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు.

కొడుకును బడిలో చేర్పడానికి వచ్చి తండ్రి మృతి



మృతుడు చదల కన్నయ్య (ఫైల్)

పాచిపెంట: కొడుకును పాఠశాలలో చేర్పించడానికి వచ్చిన ఓ తండ్రి అకస్మాత్తుగా మృతి చెందిన సంఘటన పాచిపెంట మండల కేంద్రంలో సోమవారం విషాదం నింపింది. ఈ ఘటనపై వైద్యాధికారి, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాయిగుడ్డి వలస గ్రామానికి చెందిన చెదల కన్నయ్య కుమారుడు గౌతం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్నాడు. అయితే పి.కోనవలస రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ తరగతికి సీటు రావడంతో సోమవారం ఉదయం రికార్డ్‌షీట్ తీసుకుని పి.కోనవలస రెసిడెన్షియల్ పాఠశాలలో జాయిన్ చేసేందుకు పాచిపెంట గిరిజన ఆశ్రమ పాఠశాలకు వచ్చాడు. పాఠశాలకు వచ్చిన కొద్దిసేపటికే ఫిట్స్ రావడంతో కింద పడిపోయాడు. వెంటనే పాఠశాల సిబ్బంది, స్థానికులు పాచిపెంట పీహెచ్‌సీకి హుటాహుటిన తరలించారు. వైద్యాధికారి వెంకటరమణ పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు.

వేసవి సెలవులు పొడిగింపు

భువనేశ్వర్: రాష్ట్రంలో వేడి, తేమతో కూడిన ఇబ్బందికర వాతావరణం కొనసాగుతోంది. వాతావరణం పూర్తిగా చల్లబడలేదు. ఈ పరిస్థితుల దృష్ట్యా పాఠశాలలకు వేసవి సెలవులు పొడిగించారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం జూన్ 18వ తేదికి బదులుగా రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు జూన్ 20న తిరిగి తెరవబడతాయని ప్రకటించారు. అన్ని జిల్లా విద్యాశాఖాధికారులకు ఈ మేరకు లేఖ జారీ చేశారు. పాఠశాలలు తెరిచిన తొలి రోజు నుంచి 6 నుంచి 14 ఏళ్ల వయసు కలిగిన విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

కోవిడ్–19 జాగ్రత్తలు..

కోవిడ్–19 ముప్పు తగ్గుముఖం పట్టినప్పటికీ పాఠశాలల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్వహించడానికి క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవాలన్నారు.సురక్షిత నీటిని తాగాలన్నారు. వైద్య పర్యవేక్షణ వంటి పరిశుభ్రత పద్ధతులు అమలులో ఉంచాలని ప్రత్యేకంగా సూచించారు.

అతిసార కట్టడికి హోటళ్ల మూత

భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లాలో అతిసార విజృంభించి కలరాగా తాండవిస్తోంది. కలుషిత ఆహార, పానీయాలు ప్రధాన కారణంగా పరిగణించిన అధికార యంత్రాంగం సమయోచిత నిర్ణయాలతో ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో జాజ్‌పూర్ జిల్లా బొరి ప్రాంతంలో 2 వారాల పాటు అన్ని హోటళ్లు మూసివేయాలని నిర్ణయించింది. కలరా సంక్రమణ దృష్ట్యా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. తహసిల్ పరిధిలో అన్ని హోటళ్లు, ధాబాలు, టీ, మిఠాయి దుకాణాలు, ఐస్ క్రీం, ఫాస్ట్ ఫుడ్, చాట్, గుప్ చుప్ అమ్మకాల నిలిపివేత, నీటి ప్యాకెట్లు కార్ఖానాలు, మత్స్య, మాంసం దుకాణాలు మూసివేయాలని పేర్కొన్నారు. అనుమతి లేకుండా దుకాణాలు తెరిచే వారికి చట్టం ప్రకారం శిక్ష విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ పరిస్థితుల్లో పుట్టిన రోజులు, సామూహిక విందులు వంటి కార్యక్రమాలు రద్దు చేసుకోవాలని అభ్యర్థించారు.

ఇరువర్గాల కొట్లాట



విచారణ చేస్తున్న డీఎస్పీ రాంబాబు, సీఐ తిరుపతిరావులు

జియ్యమ్మ వలస రూరల్: మండలంలోని తురకనాయుడు వలస గ్రామంలో హరిజనులు, ఎరగ్రొల్లల మధ్య కొట్లాట జరిగింది. జియ్యమ్మవలస పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం హరిజనవాడలో ఓ శుభకార్యం జరగడంతో సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో కార్యక్రమం ముగిసిన తరువాత అద్దె సామగ్రిని వ్యాన్‌పైకి ఎక్కిస్తున్న సమయంలో ఆ మార్గం గుండా ఎర్రగొల్లలకు చెందిన గొర్లి రాజు, గొర్లి చందులు స్కూటీపై వెళ్తూ దారికి అడ్డంగా ఉన్న సామగ్రిని తొలగించమని చెప్పగా, అక్కడే ఉన్న ఎత్తుల హరి కొద్ది నిమిషాలు ఓపిక పట్టమని చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి కొట్లాటకు దిగారు. ఈ కొట్లాట హరిజన పేటలో హరిజనులు, ఎర్ర గొల్లల మధ్య తీవ్ర స్థాయిలో జరిగింది. కొట్లాటలో పలువురికి గాయాలు కాగా ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించాయి. ఎర్రగొల్లలు దౌర్జన్యానికి దిగుతూ తమపై కుల దూషణ చేశారంటూ హరిజనులు కేసు పెట్టగా, గొర్లి రాజు గొర్లి చందు, లక్ష్మి, గొర్లి మజ్జి, గొర్ల పాపారావులపై జియ్యమ్మవలస పోలీసులు అట్రాసిటి కేసు నమోదు చేశారు. దీంతో పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టీవీ తిరుపతిరావు సిబ్బందితో తురకనాయుడు వలస గ్రామంలో విచారణ చేపట్టారు. బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించి ఇరువర్గాలను సమన్వయ పరిచారు. కార్యక్రమంలో జియ్యమ్మ వలస ఏఎస్సై ప్రశాంత్ కుమార్, చినమేరంగి ఎస్సై పి.అనీషలు పాల్గొన్నారు.

గర్భాం బీట్-1, బుట్ట మొక్కల పెంపక కేంద్రాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది



హరితహారాలుగా నగరవనాలు

- జిల్లాలో నాటేందుకు 20 లక్షల మొక్కలు సిద్ధం
- అటవీ ప్రాంతాల్లో నచ్చినట్లు రోడ్లు వేస్తామంటే కఠిన చర్యలకు సిద్ధం
- జిల్లా అటవీశాఖ అధికారి కొండలరావు

విజయనగరం గంటస్తంభం: నగరవనాలు.. హరిత హారాలుగా ఆరోగ్యకర గాలిని అందిస్తాయి.. జిల్లాలో ఈ ఏడాది 20 లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యం. ఈ మేరకు మొక్కలు సిద్ధం చేశాం. మియావాకి పద్ధతిలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నాం. తక్కువ ప్రాంతంలో ఎక్కువ మొక్కలు పెంచడమే ఈ జపనీస్ పద్ధతి ప్రత్యేకత. జిల్లాలో మూడు నగరవనాలను అభివృద్ధి చేస్తున్నాం. సారిపల్లిలో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది. బేతనాపల్లి, కొండవెలగాడల్లో పనులు జరుగుతున్నాయి. నగరంలో ఆక్సిజన్ స్థాయిని పెంచేందుకు ఇవి దోహదపడతాయి. ప్రతి నగర వనంలో పర్యావరణ విద్యకు సంబంధించి ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని జిల్లా అటవీశాఖ అధికారి ఆర్.కొండలరావు తెలిపారు. 'సాక్షి'తో సోమవారం ఆయన మాట్లాడారు. మొక్కల పెంపకం, అటవీప్రాంత పరిరక్షణ చర్యలను వివరించారు.



జిల్లా అటవీ శాఖ అధికారి ఆర్.కొండలరావు

మియావాకి పద్ధతి మంచిది..

- ఈ పద్ధతిలో తక్కువ సమయంలో దట్టమైన, స్థానిక అడవులను సృష్టించవచ్చు. తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలను నాటడం ద్వారా సహజ అడవులను అనుకరించడం జరుగుతుంది.
- వివిధ రకాల మొక్కలను ఒకే ప్రదేశంలో నాటడం వల్ల బహుళ అంతస్తుల అడవిని సృష్టించవచ్చు.
- ఇవి గ్లోబల్ వార్మింగ్ ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. జీవవైవిధ్యం సాధ్యమవుతుంది.
- భూగర్భ జలాల నిల్వ, భూమిని చల్లగా ఉంచడం, ధ్వని, ధూళి నివారణ, నేలల పరిరక్షణకు దోహదపడుతుంది.



నర్సరీ నుంచి రైతులకు ఉచితంగా సరఫరా చేస్తున్న మొక్కలు

జూన్- సెప్టెంబర్...

వర్షాకాలంలో ఉపాధి హామీ నిధులతో సుమారు 20 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యలో వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు కార్యాలయాలు, పంచాయతీలు, రైతులు, పరిశ్రమలు, పాఠశాలల ఆవరణ, రహదారుల పక్కన మొక్కలు నాటుతాం. ఎవరికైనా మొక్కలు కావాలంటే అటవీశాఖ అధికాలను సంప్రదించాలి.

ఆక్రమిస్తే కఠిన చర్యలు...

వనాల సంరక్షణపై రేంజ్, సెక్షన్ అధికారుల స్థాయిలో సమీక్ష నిర్వహించి, పలు సూచనలిచ్చాం. చెట్ల నరికివేత, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. రిజర్వు ఫారెస్ట్‌లో ఆక్రమణలు, చెట్ల నరికివేత వంటివి జరిగితే కేసులు పెడతాం. వన్యప్రాణులను వేటాడి తరలించేవారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ఇటీవల జొన్నాడ వద్ద అక్రమంగా తరలిస్తున్న ఉడుమును పట్టుకుని విశాఖపట్నం 'జూ'కు తరలించాం. అటవీ ప్రాంతంలో ఇష్టారాజ్యంగా రోడ్లు వేస్తే అడ్డుకుంటాం.

ప్రజల భాగస్వామ్యంతో మొక్కల రక్షణ

మొక్కల సంరక్షణకు ప్రజలను భాగస్వాములను చేస్తాం. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచిస్తున్నాం. అధికారులు, స్వయం సహాయక బృందాలు, విద్యాలయాలు, సంస్థలు, విద్యార్థులు ఇలా.. అన్నివర్గాల వారు మొక్కల సంరక్షణలో భాగస్వాములైతే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది.

మొక్కల సరఫరా ఇలా..

- టేకు, కొబ్బరి, జీడిమామిడి తదితర మొక్కలను రైతులకు ఉచితంగా సరఫరా చేస్తాం.
- ఎన్ఆర్ఈజీఎస్ కింద పెంచబడిన పొడవైన మొక్కలను పీడీ, డీడబ్ల్యూఎంఏ, డీఆర్‌డీఏ, ఇతర ప్రభుత్వ విభాగాలకు ఉచితంగా సరఫరా చేస్తారు.
- సీఏఎంపీఏ పథకం కింద పెంచిన మొక్కలను ప్రభుత్వ విభాగాలు, పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలకు ఖర్చు ప్రాతిపదికన మాత్రమే సరఫరా చేస్తారు.